క్లుప్తంగా

నేడు బైక్ ర్యాలీ


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి సుంకర్ విశాల్

దూద్‌బౌలి: హనుమాన్ జయంతిని పురస్కరించుకొని గురువారం ఉదయం 10 గంటలకు విశ్వ హిందూ పరిషత్తు ఆర్యనగర్ జిల్లా ఆధ్వర్యంలో కామాటిపురా పాతాళ హనుమాన్ ఆలయం నుంచి వీర హనుమాన్ విజయయాత్ర బైక్ ర్యాలీని నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి సుంకర్ విశాల్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. పాతాళ హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమయ్యే ర్యాలీ దూద్‌బౌలి ఎక్స్ రోడ్డు, జామే నిజామియా, హుస్సేనీఆలం, బారాగల్లీ, ఖబూతర్‌ఖానా, చిన్న బజార్, గొల్లకిడికి, ఎస్‌వీనగర్, పార్థివాడ, గుడ్‌విల్ చౌరస్తా, పురానాపూల్ మీదుగా తాడ్‌బన్‌కు చేరుకుంటుందని తెలిపారు.

నియామకం


నియామక పత్రాన్ని అందుకుంటున్న యాదయ్యగౌడ్

చార్మినార్: టాడీ టాపర్ కో ఆపరేటివ్ సొసైటీ దూద్‌బౌలి (టీసీసీ) ఎన్నికలు బుధవారం దూద్‌బౌలిలోని కార్యాలయంలో నిర్వహించారు. ఎన్నికల అధికారి శ్రీధర్, చార్మినార్ ఎక్సైజ్ ఎస్‌ఐ రాఘవేంద్ర పర్యవేక్షణలో జరిగాయి. సంఘం సభ్యుల సమక్షంలో జరిగిన ఈ ఎన్నికల్లో దూద్‌బౌలి టీసీసీ అధ్యక్షుడిగా యాదయ్యగౌడ్, ఉపాధ్యక్షుడిగా బొంగు నరేందర్‌గౌడ్, కార్యదర్శిగా ఎం.గోపీగౌడ్, డైరక్టర్లుగా ముప్పిడి మురళీధర్‌గౌడ్, ప్రహ్లాద్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా నియమితులైన యాదయ్యగౌడ్ మాట్లాడుతూ.. కల్లుగీతా కార్మికుల అభ్యున్నతికి పాటు పడతానని ఆయన తెలిపారు.

తుది దశకు హుమాయున్ నగర్ పోలీస్ స్టేషన్ పనులు

గోల్కొండ: హుమాయున్ నగర్ నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. మెహిదీపట్నం రైతుబజార్‌ను ఆనుకుని నూతన పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణం జరుగుతున్నది. హుమాయున్‌నగర్, ఆసిఫ్‌నగర్, గోల్కొండ నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులు ఒకేరోజు ప్రారంభమయ్యాయి. అయితే వివిధ కారణాల పనుల వల్ల హుమాయున్ నగర్ పోలీస్‌స్టేషన్ పనులు సమయానికి పూర్తి కాలేదు. కొత్త పోలీస్ స్టేషన్‌ల ఏర్పాట్లతో పాటు జోన్ల వికేంద్రీకరణ జరగడంతో ఈ పోలీస్ స్టేషన్ నిర్మాణ పనుల్లో వేగం పెంచారు.

అగ్నిప్రమాదం


చెలరేగుతున్న మంటలు

గౌలిపురా: ఓ మెడికల్ షాపుపై అంతస్తులో వృథాగా పడేసిన స్క్రాప్‌లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగిన ఘటన బుధవారం మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆస్రా ఆస్పత్రి ఎదురుగా నున్న సాజిద్ మెడికల్ షాపుపై అంతస్తులో వృథా ఉన్న సామాన్లు (స్క్రాప్)ను పడేశారు. బుధవారం సాయంత్రం ప్రమాదవశాత్తు అందులో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న మొఘల్‌పురా అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం జరగలేదని పోలీసులు తెలిపారు.

నకిలీ జోతిష్యుల అరెస్టు

మణికొండ: వచ్చీ రాని జోతిష్యంతో ప్రజలను మోసం చేస్తున్న ఇద్దరిని, ఓ కారు డ్రైవర్‌ను నార్సింగి ఎస్ఓటీ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం...సిరిసిల్ల జిల్లాకు చెందిన ఎర్నాల సారయ్య, గిత్త శివకుమార్‌లు తమ మారుతి బ్రెజా కారులో తిరుగుతూ కనిపించిన వారికి మీకు సమస్యలు ఉన్నాయి, ఎవరో మీకు చేతబడులు చేశారు, వాటిని పూజ చేసి పోగొడతాము అని నమ్మిస్తారు. వారు ఇచ్చిన డబ్బులు తీసుకుని వచ్చీరాని పూజలు చేసి అక్కడి నుంచి ఉడాయిస్తారు. బుధవారం కోకాపేటలోని గోల్డన్‌మైల్ లేఅవుట్‌లో తిరుగుతూ కొందరిని మోసం చేయటంతో వారు సమాచారం ఇవ్వటంతో అరెస్టు చేశారు. వారి నుంచి రూ.84వేల డబ్బు, 4సెల్ ఫోన్‌లు, ఓ కారు, మొత్తం రూ.12 లక్షల విలువగల సొత్తును స్వాధీనం చేసుకుని నార్సింగి పోలీసులకు అప్పగించినట్లు ఎస్ఓటీ పోలీసులు తెలిపారు.

బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాబూ జగ్జీవన్‌రామ్ సేవలను పలువురు కొనియాడారు.
– అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం


పూలమాలలు వేస్తున్న మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా


ఎల్బీస్టేడియం వద్ద.. లక్ష్మీనారాయణ తదితరులు


నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు జీవన్‌సింగ్


సుల్తాన్‌షాహీ వాల్మీకినగర్‌లో ..


నివాళులర్పిస్తున్న మెట్టు వెంకటేష్, పూజారిలాల్


ఇందిరానగర్‌లో.. బీఆర్ఎస్ నాయకులు మనోహర్ గైక్వాడ్ తదితరులు


నివాళులర్పిస్తున్న ఇమాంపురా ఎస్‌బీఎస్ అధ్యక్షుడు సత్యనారాయణ తదితరులు


నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ, కావూరి వెంకటేష్, చాట్ల బాబు


నివాళులర్పిస్తున్న దిండి సుధాకర్ తదితరులు


సూర్యలోగ్ కాంప్లెక్స్‌లో ..


పురానాపూల్ హరిజన బస్తీ కమాన్ వద్ద.. కార్పొరేటర్ రాజ్‌మోహన్

నేటి హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయండి

గౌలిపురా: హనుమాన్ శోభాయాత్రను విజయవంతం చేయాలని గౌలిపురా మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర పిలుపునిచ్చారు. ఈనెల 6న గౌలిపురా మార్కెట్ హనుమాన్ ఆలయం నుంచి సాయంత్రం 6 గంటలకు హనుమాన్ శోభాయాత్ర ప్రారంభమవుతుందన్నారు. హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమయ్యే ఈ హనుమాన్ శోభాయాత్ర ఛత్రినాక, లాల్‌దర్వాజా, లాల్‌దర్వాజా మోడ్, శాలిబండ చౌరస్తా, హరిబౌలి శ్రీ అక్కన్న మాదన్న ఆలయం, బేలా చౌరస్తా, గౌలిపురా మార్కెట్ తదితర ప్రాంతాల మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంటుందన్నారు. ఈ హనుమాన్ శోభాయాత్రలో యువకులు, ప్రజలందరూ పెద్ద సంఖ్యలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో మైనార్టీలతో ప్రవీణ్‌కుమార్

నాంపల్లి: బీఆర్ఎస్ పాలనలో ముస్లిం మైనార్టీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని బుధవారం రాష్ట్ర బీఎస్పీ కార్యాలయంలో ముస్లిం మైనార్టీ కన్వీనర్ల ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు జరిగింది. ఈ కార్యక్రమానికి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్‌తో పాటుగా ముఖ్యఅతిథులుగా రాజ్యసభ సభ్యులు రాంజీ గౌతమ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఖదీర్ ఖాన్ హత్యకు గురైతే ప్రభుత్వం నేటికీ ఎలాంటి చర్యలు కోలేదని, ఆ కుటుంబానికి ఎటువంటి సహాయం చేయలేదని, నిందితులను శిక్షించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో ఉన్న వక్ఫ్‌బోర్డు భూములను లీజుకు ఇచ్చి, వచ్చిన ఆదాయాన్ని ముస్లింల అభివృద్ధికి ఉపయోగించడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దయానంద రావు, రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్ ముదిరాజ్, వెంకటేష్ చౌహాన్, సతీష్, పసుపుల బాలస్వామి, మౌలానా షఫీ, అబ్రార్ హుస్సేన్, అనితా రెడ్డి, నిర్మల, అరుణ క్వీన్, సాంబశివగౌడ్ పాల్గొన్నారు.

ఉమ్రా యాత్రికులకు సన్మానం



గోల్కొండ: ఉమ్రా యాత్రకు వెళ్లే భాగ్యం ప్రతి ఒక్క ముస్లింకు ఆ భగవంతుడు కల్పించాలని జంట నగరాల మజ్లిస్ వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జావెద్ అలీ అన్నారు. ఉమ్రా యాత్రకు వెళ్తున్న ఎంజేపీ కంపెనీ మహ్మద్ అఫ్జల్ తదితరులను ఆయన బుధవారం సన్మానించారు. గోల్కొండ మహ్మద్ లైన్స్‌లో ఎంజేపీ కంపెనీలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉమ్రా యాత్రకు వెళ్తున్న వారిని ఆయన పూలమాలలు వేసి సన్మానించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకుడు గోపాల్‌జీ తదితరులు

అబిడ్స్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను పోలీసులు అరెస్టు చేసినందుకు నిరసనగా రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేశారు. అబిడ్స్ కట్టెలమండిలోని బీజేపీ కార్యాలయం ముందు ప్రభుత్వ దిష్టిబొమ్మను రాష్ట్ర బీజేపీ కో ఆర్డినేటర్ గోపాల్‌జీ, బీజేపీ నేతలు కృష్ణ, ప్రతాప్, ప్రకాష్‌రెడ్డి, సుధాకర్ శర్మలు దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఐఎన్‌టీఎస్‌ఓలో ప్రతిభ

గోల్కొండ: 'ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ (ఐఎన్‌టీఎస్‌ఓ) పరీక్షల్లో మెహిదీపట్నం జోన్ శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా మెహిదీపట్నం జోన్ ఏజీఎం బి.కృష్ణ మాట్లాడుతూ 'ఇండియా వ్యాప్తంగా మూడు నుంచి 10వ తరగతి వరకు జరిగిన ఐఎన్‌టీఎస్‌ఓ సెకండ్ లెవల్ పరీక్షలో మెహిదీపట్నం జోన్ నుంచి ఇద్దరు విద్యార్థులు గ్రాండ్ ప్రైజ్‌లుగా ల్యాప్‌ట్యాప్‌లను గెలుపొందగా, పదిమంది ట్యాబ్‌లను సాధించారు. అదేవిధంగా 67మంది విద్యార్థులు టాప్ 5 ర్యాంకుల్లో నిలవగా, 1224 మంది మెడల్స్ సాధించారు' అన్నారు. ఐఎన్‌టీఎస్‌ఓలో ప్రతిభ చూపిన విద్యార్థులను శ్రీచైతన్య పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ సీమ ఈ సందర్భంగా అభినందించారు.



కార్వాన్ రాంసింగ్‌పురాలో పిడుగుపాటు



గోల్కొండ: బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. కాగా కార్వాన్ రాంసింగ్‌పురాలో ఓ చెట్టుపై పిడుగు పడడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సుమారు గంటన్నర పాటు ఉరుములతో ప్రజలు ఆందోళన చెందారు. అయితే సుమారు 8.30 గంటల ప్రాంతంలో రాంసింగ్‌పురాలో హనుమాన్ ఆలయం వీకే భవన్ వద్ద ఉన్న ఓ ఎత్తైన కొబ్బరి చెట్టుపై పిడుగుపడింది. వెంటనే ఆ చెట్టుకు మంటలు అంటుకున్నాయి. పచ్చని ఆకుల మధ్య ఎర్రని మంటను చూసి స్థానికులు ఆందోళనకు గురయ్యారు. పిడుగుపాటు ఘటన జరగడం ఈ ప్రాంతంలో మొదటిసారి కావడంతో యువకులు ఘటన స్థలానికి వచ్చి కొబ్బరి చెట్టుపై మంటలను ఆశ్చర్యంగా చూస్తున్నారు.

అంతర్‌రాష్ట్ర సెల్‌ఫోన్ల దొంగ అరెస్టు

రాజేంద్రనగర్: జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చిన 15 రోజులకే దొంగతనానికి పాల్పడ్డ ఓ అంతర్‌రాష్ట్ర సెల్‌ఫోన్ల దొంగను రాజేంద్రనగర్ సీసీఎస్, రాజేంద్రనగర్ పోలీసులు సంయుక్తంగా పట్టుకుని అతడి వద్ద నుంచి 15 లక్షల రూపాయల విలువ చేసే సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. రాజేంద్రనగర్ ఏసీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏసీపీ గంగాధర్ వివరాలను వెల్లడించారు. కర్నూల్ జిల్లా, చదువుల రామయ్య కొట్టాలు ప్రాంతానికి చెందిన కొమ్ము వంశీకృష్ణ(29) ఆటో డ్రైవర్. ఇతడు సెల్‌ఫోన్ దుకాణాల్లో దొంగతనాలకు పాల్పడతాడని.. కర్నూల్, తిరుపతి, గద్వాల్, గుత్తి, అనంతపూర్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఆరు కేసుల్లో నిందితుడని చెప్పారు. గత నెల 23వ తేదీన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 122 పిల్లర్ వద్ద ఉన్న లాట్ మొబైల్ దుకాణంలో జొరబడి యాపిల్-12 ఫోన్‌లు నాలుగు, గెలాక్సీ సామ్‌సంగ్ ఫోన్‌లు 8, వన్ ప్లస్ ఫోన్‌లు ఏడు, ఒప్పో, వివో ఫోన్‌లను దొంగిలించాడు. మొత్తం 21 ఫోన్‌ల విలువ 15,38,000 ఉంటుందని దుకాణం యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దొంగతనం చేసిన వాటిలో ఒక ఫోన్‌ను తనకు తెలిసిన బంధువుకు విక్రయించాడు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పోలీసులు బుధవారం ఉదయం నిందితుడిని పట్టుకుని అతడి వద్ద నుంచి 15 సెల్‌ఫోన్లు, 8,716 రూపాయల నగదును స్వాధీనం చేసుకోని రిమాండ్‌కు తరలించారు.

యువత సన్మార్గం వైపు పయనించాలి: అక్బరుద్దీన్ ఒవైసీ


ఇఫ్తార్ విందులో అక్బరుద్దీన్ ఒవైసీ

గోల్కొండ: ముస్లిం యువత ప్రవక్త మహ్మద్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని సన్మార్గం వైపు పయనించాలని షేక్‌పేట్‌లో ఇఫ్తార్ విందులో మజ్లిస్ శాసన సభా పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. బుధవారం బల్దియా స్టాండింగ్ కమిటీ సభ్యులు, షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషెద్ ఫరాజుద్దీన్ షేక్‌పేట్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం యువతను ఉద్దేశించి మాట్లాడారు. ప్రవక్త మహ్మద్ జీవితం శాంతి, ఓర్పుకు నిదర్శనమని ఆయన అన్నారు. రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందని, ఈ మాసాన్ని ఖురాన్ గ్రంథ పఠనంతో పాటు ఉపవాస దీక్షల్లో పూర్తిగా లీనమవ్వాలని ఆయన సూచించారు. బస్తీలు, కాలనీలలోని యువకులు ఇఫ్తార్ విందుల ఏర్పాటుకు ముందుకు రావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ రాషెద్‌ఫరాజుద్దీనద్, మజ్లిస్ నాయకులు హాఫెజ్ మహ్మద్ రహ్మతుల్లా సయ్యద్‌తో పాటు మజ్లిస్ సీనియర్ నాయకులున్నారు.

అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి


డ్రైనేజీ లైన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లోని నిజాం కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ జరుగుతున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. పనుల్లో జాప్యం కారణంగా తమకు ఎంతో అసౌకర్యం కలుగుతుందని, తవ్వకాలతో రోడ్లు అధ్వానంగా మారాయని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేయించడం జరిగిందన్నారు. నానల్‌నగర్ డివిజన్‌లో మొట్ట మొదటి బాక్స్ టైప్ డ్రైనేజీ నిర్మాణం నిజం కాలనీలో జరిగిందని, దీని కోసం కోటి పది లక్షల రూపాయలు వ్యయం జరిగిందన్నారు. ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న నిజాం కాలనీలో అన్ని రకాల అభివృద్ధి పనులు చేయించడం జరిగిందన్నారు. కాగా ప్రస్తుతం నిజాం కాలనీ, అల్ హస్నాత్ కాలనీ ఎగువ భాగాన ఉన్న బుల్కాపూర్ నాలా మళ్లింపు పనులు జరుగుతున్నాయని ఈ కారణంగా డ్రైనేజీ పనుల్లో జాప్యం జరిగిందని ఆయన అన్నారు. ఆయన వెంట పలువురు బల్దియా అధికారులతో పాటు పలువురు స్థానిక నాయకులున్నారు.

అభినందనలు


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

విజయనగర్‌కాలనీ: ఇటీవల నిర్వహించిన మాస్టర్ హోరేటర్ కాంటెస్ట్ కాంపిటీషన్‌లో విజయనగర్‌కాలనీ నారాయణ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 4వ తరగతి చదువుతున్న శ్రేయాంక్ మొదటి స్థానాన్ని పొందగా, 5వ తరగతి చదువుతున్న మహ్మద్ అబ్దుల్ రహమాన్ రెండవ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మల తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెమొంటోలు, బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ పద్మ, నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి, ఏజీఎం శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ నవీన్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలు



మాట్లాడుతున్న నందకిశోర్‌వ్యాస్ తదితరులు

అబిడ్స్: కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలాంటివారని రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు నందకిశోర్‌వ్యాస్ పేర్కొన్నారు. కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడు అండగా ఉండి వారి సంక్షేమానికి, వారి అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. బేగంబజార్ డివిజన్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ పూజవ్యాస్ బిలాల్ ఆధ్వర్యంలో జరిగిన బేగంబజార్ డివిజన్ బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. ప్రతిఒక్కరూ కలిసి కట్టుగా ఉండి పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. అందరి కలయికతోనే బీఆర్ఎస్ పార్టీ నంబర్-1 స్థాయిలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, బీఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్, పూజవ్యాస్ బిలాల్, సునీల్ సాహు, శంకర్‌లాల్ యాదవ్, పప్పుమాత్రే, ప్రదీప్‌రాజ్, ముత్యాల గోవింద్‌రాజ్, ఆర్.వి.మహేందర్, సుదర్శన్ రాథోడ్, జయశంకర్, శంకర్ సింగ్ జమేదార్, సంతోషి, మీనాక్షి పాల్గొన్నారు.

పడమటి సంధ్యారాగం లాంటి చిత్రాలు రావాలి


సినీ నిర్మాత మీర్ అబ్దుల్లా దంపతులకు పురస్కారాన్ని అందజేస్తున్న అతిథులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వంశీ ఆర్ట్ థియేటర్స్, శుభోదయం గ్రూప్‌ల ఆధ్వర్యంలో పడమటి సంధ్యారాగం చిత్రం 36 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ చిత్ర సహ నిర్మాత మీర్ అబ్దుల్లా, అజీజాలకు గ్లోబల్ అవార్డును బుధవారం రవీంద్రభారతిలో అందజేశారు. ఈ సందర్భంగా బాలు పాటకు పట్టాభిషేకం పేరిట నిర్వహించిన సంగీత విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ దర్శకులు రేలంగి నర్సింహారావు, ప్రొఫెసర్ బీవీ.పట్టాభిరామ్, సినీ నిర్మాత రామసత్యనారాయణ, నటుడు ఎంఆర్.చౌదరి, కళా పత్రిక సంపాదకులు మహ్మద్ రఫీ, వంశీ సంస్థల వ్యవస్థాపకులు వంశీ రామరాజు అధ్యక్షురాలు సుధాదేవి తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రంలో నియంత పాలన'


బీజేపీ నాయకులతో దేవర శ్రీనివాస్

గోల్కొండ: సీఎం కేసీఆర్ నియంతలా వ్యవహరిస్తూ అప్పటి నిజాం నవాబులను తలపిస్తున్నాడని బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవర కరుణాకర్ ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్టును నిరసిస్తూ బుధవారం గుడిమల్కాపూర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రజాకార్ల పాలన తలపిస్తూ సీఎం కేసీఆర్ పరిపాలిస్తున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో అన్ని రకాల పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలు మార్కెట్‌లో లభిస్తున్నాయని, దీనికి రాష్ట్ర మంత్రులే సూత్రదారులుగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. లీకేజీలను అరికట్టలేని అసమర్థ సీఎం వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభు పూజారి, నామా యాదగిరి, సుధాకర్ యాదవ్ తదితరులున్నారు.

ఫ్రూట్ గిఫ్ట్ ప్యాక్‌లకు భలే గిరాకీ



గోల్కొండ: రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష విరమణకు ఎక్కువగా పండ్లను వాడుతారు. రంజాన్ మాసంలో ముస్లింలు తమ స్నేహితులు, బంధువులకు ఇఫ్తార్ కోసం ప్రత్యేకంగా తయారు చేసిన ఫ్రూట్ గిఫ్ట్ ప్యాక్‌లను అందిస్తారు. రంజాన్ మాసంలో ఫ్రూట్ గిఫ్ట్ ప్యాక్‌లకు బాగా గిరాకీ ఉంటుంది. టోలిచౌకి, మెహిదీపట్నం తదితర ప్రాంతాల్లో ఫ్రూట్ షాపుల వారు వివిధ రకాల సైజు ఫ్రూట్ గిఫ్ట్ ప్యాక్‌లను ప్రత్యేకంగా తయారు చేస్తారు. మినీ, మీడియం సైజు నుంచి జంబో సైజుల దాకా ఈ ఫ్రూట్ గిఫ్ట్ ప్యాకెట్‌లు ప్రత్యేకంగా వెదురుతో తయారు చేసిన ట్రేలలో అందంగా అలంకరించి పెడుతారు. కాగా వీటి ప్రారంభ ధర రూ.800 నుంచి ఉంది. జంబో సైజు ధర రూ. 3500 వరకు ఉంటుంది. జంబో గిఫ్ట్ ప్యాక్‌లు విదేశీ పండ్లు, విదేశీ కర్జూరాలు ఉంటాయి. అంతేకాకుండా 3 రకాల ద్రాక్ష, రెండు రకాల ఆరెంజ్, పుచ్చకాయతో పాటు పైనాపిల్ బాక్సులు ఉంటాయి. కరోనా తర్వాత నుంచి ఈ గిఫ్ట్ ప్యాక్‌ల అమ్మకం పెరిగిందని మెహిదీపట్నం రాయల్ ఫ్రూట్ నిర్వాహకుడు అబ్దుల్ అజీజ్ అంటున్నారు.